ఎన్నికలు ప్రశాంతం

- ఊపిరి పిల్చుకున్న ఎన్నికల అధికారులు
- నియోజకవర్గంలో 80 శాతం పోలింగ్
- పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ
- కొన్ని పోలింగ్ కేంద్రాల్లో రాత్రివరకు సాగిన పోలింగ్

తిర్యాణి: కుటుంబ సమేతంగా ఓటు వేసినట్లు చూపిస్తున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవ లక్ష్మి కుటుంబసభ్యులు

ఆసిఫాబాద్,నవంబర్30 : అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికలు గురువారం ప్రశాంత వాతావరణంలో జరిగాయి. అక్టోబర్ 9వ తేది నుంచి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి యంత్రాంగా ఎన్నికల నిర్వహణలో నిమగ్న మయ్యారు. ఎన్నికలను పకడ్బందీగా నిర్వ హించేందుకు కలెక్టర్ హేమంత్ సహదేవ రావు,ఎస్పీ సురేశ్‌కుమార్ ప్రణాళిక ప్రకారం ముందుకు సాగారు.ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై ప్రత్యేక నిఘా ఉంచడంతో పాటు ప్రతి రోజు సంబంధిత అధికారులను సమన్వయం చేయడంతో ఎన్నికలు విజయవంతంగా పూర్తి చేశారు. ఆసిఫాబాద్ నియోజవర్గంలో 2,26,664 ఓటర్లు ఉండగా ఇందులో.....శాతం ఓటింగ్ నమోదైంది. ఉదయం 7 గంటల నుంచి 305 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ ప్రారంభం కాగా మొదటి రెండు గంట ల్లో 15.48 శాతం, ఉదయం 11 గంటల వరకు 26.32 శాతం,మధ్యాహ్నం 1 గంట వరకు 45.53 శాతం, సాయంత్రం 3 గంటల వరకు 62.13 శాతం, సాయంత్రం 5 గంటల వరకు 72.08 శాతం నమోదైంది. సాయంత్రం 4 గంటల వరకే పోలింగ్ సమయం ఉండడంతో పోలింగ్ కేంద్రాల్లోకి వెళ్లిన ఓటర్లకు ఓటు వేసేందుకు అనుమతి ఇచ్చారు. దాదాపుగా రాత్రి 7 గంటల వరకు పోలింగ్ కొసాగింది. బీఆర్ఎస్ అభ్యర్థి కోవలక్ష్మి తిర్యాణి మండలంలోని భీమ్‌జీగూడలో ఓటు వేశారు. జన్కాపూర్‌లోని 198 పోలింగ్ కేంద్రంలో కలెక్టర్ హేమంత్ సహదేవరావు ఆయన సతిమణి రేవతి ఓటు వేశారు. బీఆర్ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి అరిగెల నాగేశ్వర్‌రావు తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎమ్మెల్యే ఆత్రం సక్కు లక్ష్మిపూర్‌లో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

● తిర్యాణి మండలంలో..

తిర్యాణి,నవంబర్ 30: మండలంలో గురువారం నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఈ ఎన్నికల నిర్వహణ కోసం మండలంలో 29 పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. మండలంలో 18,175 ఓటర్లు ఉండగా 13,467మంది ఓటును వినియోగించుకున్నారు. దీంతో 74.9శాతం పోలింగ్ జరిగినట్లు తహసీల్దార్ ప్రహ్లాద్ తెలిపారు. ఆసిఫాబాద్ నియోజకవర్గ అభ్యర్థి కోవ లక్ష్మి తన కుటుంబ సమేతంగా తమ స్వగ్రామైన మందగూడ పోలింగ్ కేంద్రంలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల్లో స్వచ్ఛందంగా ప్రజలు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు స్వచ్ఛందంగా వచ్చి తమ ఓటును వినియోగించుకున్నారు. ఈ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అధికారులు, పోలీసులు గట్టి బందోబస్తు చేపట్టారు. తమతమ పార్టీల పట్ల ఓట్ల శాతంపై పోలింగ్ వారీగా,గ్రామాల వారీగా పడ్డ ఓట్ల శాతంపై ఆయా పార్టీల నాయకులు ఆరా తీయడం ప్రారంభించారు.

● సిర్పూర్(యు)మండలంలో..

సిర్పూర్(యు) నవంబర్ 30 : మండలంలో గురువారం అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మండలలోని 21 పోలింగ్ కేంద్రాల్లో పోలీసుల భారీ బందోబస్తుతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉదయం 7 గంటకు ప్రారంభమైన ఎన్నికలు సాయంత్రం 6 గంటల వరకు కొనసాగాయి. మండలంలోని మొత్తం 12081 ఓట్లలో 10157 ఓట్లు పోలవడంతో 84.06 శాతం పోలింగ్ నమోదైందని తహసీల్దార్ ఎస్ రమేశ్ తెలిపారు. కాగా సెట్టిహడ్పునూర్ పోలింగ్ కేంద్రంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవ్‌రావ్ తమ ఓటును వినియోగించుకున్నారు.ఆయనతో పాటు ప్రజాప్రతినిధులు ప్రజలు స్వచ్ఛందంగా పోలింగ్ కేంద్రాలకు చేరుకొని తమ ఓటును వినియోగించుకున్నారు.

● కెరమెరి 82 శాతం పోలింగ్..

కెరమెరి, నవంబర్ 30: మండలంలో నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన ఎన్నికలకు పొగమంచు కమ్ముకోవడంతో చలి తీవ్రత పెరిగి గంట సేపు ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. అనంతరం వాతావరణం పొడిగా మారడంతో ప్రజలు పోలింగ్ కేంద్రాలకు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఓటు వేసేందుకు బారులు తీరారు. ఎన్నికలు జరుగుతున్న సరళిని ఎస్పీ. కే.సురేశ్ కుమార్ పరిశీలించి, ఎన్నికలు ముగిసే వరకు అప్రమత్తంగా ఉంటూ తీసుకోవాల్సిన జాగ్రతలపై పోలీసులకు పలు సూచనలు ఇచ్చారు. సమస్యాత్మక ప్రాంతాల్లో సాయంత్రం 4గంటలలోపు ఓటింగ్ పూర్తి చేయాలని ఆదేశాలున్నా ఒకటే పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయడంతో ఓటర్లతో ఆ ప్రాంతం నిండిపోయింది. ప్రతిసారి మహిళా, పురుషులకు వేర్వేరుగా రెండు పోలింగ్ కేంద్రాలు ఉండగా ఈసారి ఒకటే ఏర్పాటు చేయడంతో ఈ సమస్య వచ్చిందని ప్రజలు అధికారుల తీరుపై మండిపడ్డారు. ఎట్టకేలకు సమయంలోపు వచ్చిన వారందరికీ టోకెన్‌లు ఇచ్చి ఓటును వినియోగించేలా చేయడంతో మండలంలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మండలంలో మొత్తం 23,323 ఓటర్లు ఉండగా జరిగిన ఎన్నికల్లో 82 శాతం ఓట్లు నమోదైన్నట్లు అధికారులు ప్రకటించారు.

● జైనూర్ మండలంలో...

జైనూర్ ,నవంబర్ 30: మండలంలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా కొనసాగింది. ఎన్నికల్లో పోలింగ్ కేంద్రానికి వంజారి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్ ముండే, సతీమణితో వచ్చి ఓటు ను వినియోగించుకున్నారు. వీరితోపాటు ప్రముఖులు ప్రజాప్రతినిధులు ప్రజలు ఓటును వినియోగించుకున్నారు. పోలింగ్ ప్రశాంతంగా జరిగే విధంగా పోలీసులు అధికారులు చర్యలు తీసుకుంటూ పర్యవేక్షించారు.

● వాంకిడిలో 77.8 శాతం పోలింగ్

వాంకిడి, నవంబర్30 : మండలంలో గురువారం నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగాయి. మండలంలో 77.8 శాతం పోలింగ్ నమోదైన ట్లు మండల ఎన్నికల అధికారి రహీమొద్దీన్ తెలిపారు. ఎన్నికల పోలింగ్ సరళిని ఆసిఫాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవలక్ష్మి, ఆసిఫాబాద్ జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు పరిశీలించారు.

● లింగాపూర్‌లో 79.58శాతం

లింగాపూర్,నవంబర్ 30: మండలంలో అధికారులు గురువారం నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల్లో మండలంలో 79.58 శాతం పోలింగ్ నమోదయినట్లు తహసీల్దార్ ప్రసాద్ వర్మ తెలిపారు. కాగా ఈ ఎన్నికల్లో మొత్తం 16 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారులు, పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లోని ఓటర్లు స్వచ్ఛందంగా పాల్గొని తమ ఓటును వినియోగించుకున్నారు.

● రెబ్బెన మండలంలో 83శాతం

రెబ్బెన, నవంబర్ 30: రెబ్బెన మండలం లో 83 శాతం పోలింగ్ నమోదు అయినట్లు ఎన్నికల అధికారులు పేర్కొన్నారు. మండలంలో 28512 మంది ఓటర్లు ఉండగా 23653 మంది ఓటు వినియోగించుకొగా 83శాతం పోలింగ్ నమోదైంది. మండలంలో మొత్తం 37 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి 5 రూట్లలో 5గురు సెక్టర్ అధికారులు, 5గురు రూట్ అధికారులతో పాటు 37 మంది ప్రీసీడింగ్ అధికారులు, 37మంది అసిస్టెంట్ ప్రీసీడింగ్ అధికారులు, 74 మంది ఇతర పోలింగ్ అధికారులు విధులు నిర్వహించారు. గంగాపూర్ పోలింగ్ కేంద్రంను ఎస్పీ సురేశ్‌కుమార్ సందర్శించి పలు సలహాలు, సూచనలు అందించారు. ఎంపీడీవో శ్రీనివాస్ అన్ని పోలింగ్ కేంద్రాలు సందర్శించి సిబ్బందికి సూచనలు చేశారు. సీఐ అల్లం నరేందర్, ఎస్ఐ చంద్రశేఖర్ లు నిరంతరం పర్యవేక్షించారు.

● మాక్ పోల్ ప్రక్రియ పూర్తి

ఆసిఫాబాద్,నవంబర్30: అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల్లో భాగంగా గురువారం జిల్లాలోని ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజవర్గల్లో ఏర్పాటు చేసిన 599 పోలింగ్ కేంద్రాల్లో మాక్‌పోల్ ప్రక్రియ పూర్తి చేసినట్లు కలెక్టర్ హేమంత్ సహదేవరావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం నుంచి మాక్‌పోల్ ప్రక్రియను ఎస్పీ సురేశ్‌కుమార్‌తో కలిసి వెబ్ కాస్టింగ్, సీసీ టీవీల ద్వారా పరిశీలించారు.

జైనూర్: ఓటు వేసి సిరా చుక్కను చూపిస్తున్న వంజారి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్ ముండే

సిర్పూర్(యు): ఓటును వినియోగించుకున్న జిల్లా గ్రంథలయ సంస్థ చైర్మన్ కనక యాదవ్‌రావ్ దంపతులు

కెరమెరిలో ఓటు వేసేందుకు బారులు తీరిన ప్రజలు

జన్కాపూర్‌లోని పోలింగ్ కేంద్రం వద్ద ఓటింగ్ విధానాన్ని పరిశీలిస్తున్న పరిశీలకులు

వాంకిడి: మండల కేంద్రంలో పోలింగ్ కేంద్రం వద్ద క్యూలో నిల్చున్న ఓటర్లు

గుండి గ్రామంలో ఓట్లు వేసేందుకు బారులు తీరిన ప్రజలు

సిర్పూర్(యు): పాములవాడ పోలింగ్ కేంద్రంలో బారులు తీరిన ఓటర్లు

రెబ్బెన : గంగాపూర్ లో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ సురేశ్‌కుమార్

లింగాపూర్ : పికతండా పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు